నేటి కందం- నేటికి అందం

పలు స్టాంపులు,నాణెము విడు
దల చేయుచు మన ప్రధాని తనదగు శైలిన్
పులకించెడి భావములను
పలికెను శ్రీ సత్యసాయి బాబా పైనన్ !!

(సత్యసాయి బాబా శతజయంతి వేడుక లలో ప్రధాని మోడీ పాల్గొని పోస్టల్ స్టాంపు లను, నాణెమును విడుదల చేసి బాబా గురించి అద్భుతంగా మాట్లాడారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

స్థానిక ఎన్నికల
సమరానికి ముందు
సర్కారు ఇందిరమ్మ
చీరలతో విందు.
కావాలని ఓట్ల కొరకు
కాదా ఇది గాలం
ఆర్థికంగా అప్పులతో
అవసరమా మేళం

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 21-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:84 పేజీలు:6 వెల: రూ.1/-

## పద్మావతి అమ్మవారి సన్నిధిలో రాష్ట్రపతి



తిరుపతి, నవంబర్ 20:రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము (ఆతీనీబీజూజీటతి ఓబీతీఎబీ) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు చేరుకున్నారు.

ఆలయ ప్రాంగణంలో రాష్ట్రపతికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఘన స్వాగతం పలికారు.

ఆలయ ముఖద్వారం వద్ద అర్చకులు సంప్రదాయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రపతి ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు.

దర్శనం తరువాత వేదపండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. ఆపై ఆశీర్వాద మండపంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆమెకు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్‌వో కే.వి. మురళీకృష్ణ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అనంతపురం డిఐజీ సీమోషీ ఘోష్, టిటిడి బోర్డు సభ్యులు జి. భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు స్వామి తదితరులు పాల్గొన్నారు

## బెంగళూరు జాతీయ రహదారిపై ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

జడ్చర్ల నవంబర్ 20 (వేక్స్ ప్రెస్ న్యూస్ );: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరా బాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ట్యాంకర్‌ను వెనుక నుంచి జగన్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ట్రావెల్స్ బస్సులోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉన్న ట్యాంకర్‌ను ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ట్యాంకర్‌లోని కెమికల్ తోనే ప్రమాద స్థలంలో పొగ వ్యాపించింది. మాచారం ఫ్లైఓవర్ వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఘాటైన వాసన, పొగతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

## 10వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నితీశ్ కుమార్

పాట్నా నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిహార్ సిఎంగా నితీష్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. పాట్నాలోని గాంధీ మైదానంలో రికార్డు స్థాయిలో పదోసారి నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. నితీశ్ కుమార్ చేత గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్ చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఎన్డియే రాష్ట్రాల సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, తదితర రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్‌డిఎ కూటమికి 202 స్థానాలు దక్కాయి. ఇందులో బిజెపికి 89, జెడియుకు 85, ఎల్‌జెపికి 19, హామ్‌కు 5, ఆర్‌ఎల్‌ఎంకు 4 స్థానాలు వచ్చాయి. ఈ క్రమంలో బిజెపి అత్యధిక స్థానాల పార్టీ అయినా తిరిగి జెడియు నేత నితీశ్‌కే సిఎం పదవి కట్టబెట్టారు.



## ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే కఠిన చర్యలు: హైదరాబాద్ సిపి సజ్జనార్

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బందితో సహా ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిపి సజ్జనార్ తెలిపారు. గురువారం తన ట్విట్టర్ సిపి సజ్జనార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు



విధులకు ఆటంకం కలిగించిన, బెదిరింపులకు దిగిన, దాడులు చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే భారత న్యాయ సంహిత (బిఎన్‌ఎస్)లోని 221, 132, 121(1) సెక్షన్స్ ప్రకారం బాధ్యులపై క్రిమినల్ కేసులను నమోదు చేయడంతో పాటు హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామన్నారు. ఒక్కసారి కేసు నమోదైతే భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉంటుందని, పాస్‌పోర్టు జారీకి, ప్రభుత్వ ఉద్యోగానికి ఇబ్బందులు వస్తాయని, క్షణికావేశంలో ఏ చిన్న తప్పు చేసిన జీవితాంతం కుమిలిపోయేలా చేస్తామని హెచ్చరించారు.

## చట్ట ప్రకారమే ఈ-కార్ రేసింగ్ కేసులో ముందు కేల్తాం

### సిఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీద కక్ష సాధించాలన్న ఆలోచన లేదు :మహేష్ గౌడ్

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు ఉన్న సంబంధాలు అందరికీ తెలుసు అని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడం వల్ల కెటిఆర్ పై చట్టం ప్రకారం చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కక్ష సాధింపు ఉంటే ప్రభుత్వం వచ్చిన వెంటనే అరెస్టు చేసేవాళ్లమని, చట్ట ప్రకారమే ఈ-కార్ రేసింగ్ కేసులో ముందుకెళ్తామని మహేష్ గౌడ్ తెలియజేశారు. సిఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీద కక్ష సాధించాలన్న ఆలోచన లేదని అన్నారు. కాళేశ్వరంపై సిబిఐ ఎందుకు విచారణ చేయడం లేదో బండి సంజయ్ చెప్పాలి? అని మహేష్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పోదని, కక్షసాధిస్తే మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే జైల్లో ఉండేవారని అన్నారు. ప్రజల సొమ్ము ఎవరు తిన్నా శిక్ష అనుభవించాల్సిందేనని, ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం ఉంటే 6 నెలల ముందే గవర్నర్ అనుమతి వచ్చేదని పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్ ఓటమి తో బిజెపికి దిమ్మతిరిగే గవర్నర్ అనుమతి ఇచ్చిందని, బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిత్తశుద్ధితోనే ఉందని స్పష్టంగా చేశారు. కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నా.. బిసి రిజర్వేషన్లు ఇవ్వడం లేదని విమర్శించారు. చట్టంపై అవగాహన లేకుండా బండి సంజయ్ మాట్లాడుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.

## ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరైన జగన్..

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. దాదాపు ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన మళ్లీ కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో హైదరాబాద్ నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టుకు జగన్ వ్యక్తిగతంగా గురువారం హాజరయ్యారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో వ్యక్తిగత హాజరు నుంచి కోర్టు మినహాయింపు ఇచ్చింది. గత ఎన్నికల అనంతరం సైతం మినహాయింపును కొనసాగించాలని కోరగా.. ఆయన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరిస్తూ తప్పనిసరిగా వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిందేనని చెప్పింది. దాంతో ఆయన ఉదయం ఏపీలోని గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సీబీఐ ప్రత్యేక కోర్టుకు వెళ్లి న్యాయమూర్తి రఘురామ్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జగన్ ముగ్గురు న్యాయవాదులతో కోర్టుకి వెళ్లారు. జగన్ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హైదరాబాద్ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉండగా.. అక్రమస్తుల కేసులో సీబీఐ 11 చార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ కేసులో తమ పేర్లను



తొలగించాలంటూ దాఖలైన సుమారు 130 డిశ్చార్జి పిటిషన్లు సైతం ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ కేసులో దాఖలైన ఆరు వేర్వేరు పిటిషన్లపై గురువారం కోర్టు విచారణ చేపట్టింది. మరో వైపు జగన్ కోర్టుకు హాజరైన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా వచ్చిన వెస్సార్‌సీపీ నేత పేర్ని నాని సహా పలువురు నేతలను పోలీసులు కోర్టు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కోర్టు ప్రధాన గేటు వద్ద అడ్డుకొని.. ప్రాంగణంలోకి అనుమతించలేదు. అదే సమయంలో భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోర్టు వద్దకు రాగా వారిని అక్కడి నుంచి దూరం గా పంపించి వేశారు. ప్రస్తుతం అక్రమాస్తుల కేసులో కోర్టు విచారణ చేపడుతున్నది.

## స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు రంగం సిద్ధం..!

హైదరాబాద్, నవంబర్ 20:స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సిద్ధమవుతోంది. నవంబర్ 26 లేదా 27వ తేదీన పంచాయతీ ఎన్నికల నగారా మోగనుందని తెలుస్తోంది. మొత్తం మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ స్పష్టం చేసింది.

మరోవైపు.. పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) బుధవారం షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ రోజు అంటే.. గురువారం నుంచి నవంబర్ 23వ తేదీ వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20వ తేదీన ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ చేయనుంది. 21వ తేదీన ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరిస్తుంది. 23వ తేదీన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే.

డిసెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలు జరుగుతాయి. ఆ తర్వాత ఈ ఎన్నికల నిర్వహించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే.. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

## రైల్వే ప్రయాణికుడికి తృటిలో తప్పిన ప్రమాదం..

హైదరాబాద్, నవంబర్ 20:ఇంటర్నెట్ డెస్క్: రైల్వే ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తుంటారు. అయితే, ఈ హితవచనాలను కొందరు పెడచెవిన పెట్టి ఇబ్బందుల్లో పడుతుంటారు. తాజాగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు కదిలే రైలు నుంచి దిగేందుకు ప్రయత్నించి చిక్కుల్లో పడ్డాడు. అయితే, ఓ ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది

స్టేషన్‌లో రైలు ఆగుతున్న క్రమంలో ఓ ప్రయాణికుడు తొందరపడి దిగేందుకు ప్రయత్నించాడు. రైలు పూర్తిగా ఆగక మునుపే దిగడంతో అతడు జారి ప్లాట్‌ఫాంపై పడ్డాడు. ప్రయాణికుడు రైలు కిందకు జారిపోతుండటాన్ని గమనించిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పవన్ కుమార్ శర్మ వేగంగా స్పందించి అతడిని కాపాడాడు. ప్రయాణికుడి చేయి పట్టి వెనక్కు లాగడంతో పెనుప్రమాదం తృటిలో తప్పిపోయింది

కాచిగూడ స్టేషన్‌లో ఇటీవలే ఇలాంటి మరో ఘటన జరిగింది. అక్టోబర్ 28న ఓ ప్రయాణికుడు తను ఎక్కవలిసిన రైలు కాక పొరపాటున మరో రైలు ఎక్కాడు. అప్పటికే రైలు బయలుదేరడంతో కంగారుపడి ప్లాట్‌ఫామ్‌పై దిగాడు. ఈ క్రమంలో కాలు జారడంతో ప్రయాణికుడు కంగారులో బోగీకి ఉన్న రాడ్డును గట్టిగా పట్టుకోవడంతో అతడిని రైలు కొంత దూరం లాక్కెళ్లింది. అప్పటికే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది ప్రమాదం జరిగే లోపే అతడిని కాపాడారు.

## మనీలాండరింగ్ కేసు.. రాబర్ట్ వాద్రాపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు

న్యూ డిల్లీ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యూకేకు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపార వేత్త, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఛార్జిషీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. కాగా, యూకేకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీ కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులైలో ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా వాద్రాపై ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## నేపాల్‌లో మళ్లీ కర్ఫ్యూ.. నిరసనలకు దిగిన జెన్ జెడ్..!



హైదరాబాద్, నవంబర్ 20:పొరుగుదేశమైన నేపాల్‌లో యువతరం మరోసారి భగ్గుమంది. రెండు నెలల క్రితం కేపీ ఓలీ ప్రభుత్వాన్ని పడగొట్టిన కే జెన్‌జెడ్ ఈసారి ఆంక్షలకు వ్యతిరేకంగా నిరసనలకు దిగింది. ప్రభుత్వం పగటిపూట కర్ఫ్యూను తిరిగి విధించడాన్ని ఖండిస్తూ బారా జిల్లాలో వందలాది యువత ఆందోళనలు చేపట్టారు. కొత్త సర్కార్ ఏర్పడినప్పటి నుంచి మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ మద్దతుదారులు, జెన్‌జెడ్ నిరసనకారులకు మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. దాంతో.. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని పగటి పూట ఆంక్షలను మళ్లీ విధించింది. అసలే కోపం మీదున్న జెన్ జెడ్ కర్ఫ్యూను నిరసిస్తూ రోడ్డెక్కారు.

అంతర్గత వివాదాలు, సంక్షోభంతో నేపాల్ వార్తల్లో నిలుస్తోంది. అధికారం పోవడంతో మండిపోతున్న కేపీ ఓలీ పార్టీ నేతలు, కార్యకర్తలు జెన్‌జెడ్‌తో తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. తాజాగా సిమరా ప్రాంతంలో నవంబర్ 19న యువతరంతో ఓలీకి చెందిన నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ(యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్) కార్యకర్తలు గొడవ పడ్డారు. ఇరువర్గాల ఘర్షణలతో ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా చూడాలని మళ్లీ ఆంక్షలు విధించింది ప్రభుత్వం. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆంక్షలు కొనసాగుతాయని తెలిపింది.

## బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 20: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపేందుకు రాష్ట్రపతి, గవర్నర్ల కు గడువు విధించడానికి సంబంధించి రాష్ట్రపతి సంధించిన 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు గురు వారం తన అభిప్రాయాన్ని వెల్లడించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని వెల్లడించింది.

చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం రాష్ట్రపతి నివేదనపై సెప్టెంబర్ 11 నుంచి 10 రోజులపాటు విచారణ జరిపి తన అభిప్రాయాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడమంటే రాజ్యాంగ అధికారాలను ధిక్కరించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. అయితే, సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం సరికాదని అభిప్రాయపడింది.

## శంషాబాద్‌లో కాల్పుల కలకలం.. కిరాయి విషయంలో ఆటో ప్రయాణికుల మధ్య గొడవ..

హైదరాబాద్, నవంబర్ 20: హైదరాబాద్‌లోని శంషా బాద్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు కిరాయి విషయంలో గొడవ పడ్డారు. దీంతో ఓ వ్యక్తి ఎయిర్ గన్‌తో మరో ప్రయాణికుడిని కాల్చాడు. శంషాబాద్ మండలం నర్కుడా వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య కిరాయి విషయంలో వాగ్వాదం చోటుచేసుకున్నది. అదికాస్తా పెద్దది కావడంతో సమీర్‌దాస్ అనే ప్రయాణికుడిని, మరో ప్రయాణికుడు ఎయిర్ గన్‌తో కాల్చాడు. దీంతో సమీర్‌దాస్ కడుపులో తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని హుటాహుటిన దవాఖానకు తరలించారు. సమాచారం

# ప్రపంచాన్ని పరిచయం చేస్తున్న ఉపకరణం టెలివిజన్

## (21 నవంబర్ "ప్రపంచ టెలివిజన్ దినోత్సవం" సందర్భంగా)

21వ శతాబ్దంలో టెలివిజన్ (టివీ) ప్రయోజనం ఏమిటి ? డిజిటల్ యుగపు టీవీ ద్వారా దృశ్య శ్రవణ సమాచార వితరణ, కేబుల్ ప్రసారాల వడ్డింపు మాత్రమే కాకుండా మల్టీమీడియా పాత్ర, వీడియో, మ్యూజిక్, ఇంటర్నెట్ అనుసంధాన ప్రయోజనాలు అనేకం కలిగి ఉంటున్నది. సామాన్య మానవుడి వినోద, విజ్ఞాన, వార్తా ప్రసారాల వేదికగా ప్రతి ఇంట్లో కనీస అవసరంగా మారింది టెలివిజన్ బాక్స్. టీవీని విచక్షణారహితంగా వాడితే వ్యక్తి పతనానికి కూడా కారణం అవుతున్నది. భారత్‌లో దాదాపు 350 మిలియన్ల కుటుంబాలు ఉండగా, అందులో 230 మిలియన్ల కుటుంబాలు (70 శాతం కుటుంబాలు) టెలివిజన్ ప్రసారాలు చూడడం జరుగుతుంది. టీవీ ప్రయోజనాలను గుర్తించిన ఐరాస ప్రతి ఏట 21 నవంబర్ రోజు "ప్రపంచ టెలివిజన్ దినోత్సవం (వరల్డ్ టీవీ డే)" పాటించడం కొనసాగుతున్నది. 2025 ప్రపంచ టీవీ దినం ఇతివృత్తంగా "అత్యంత నమ్మకమైనా నేస్తం – సమాచారం, సాధికారత, అనుసంధానం" అను అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### టివీ విస్తృత ప్రయోజనాలు:

ప్రజలను ప్రభావితం చేసే విభిన్న సమస్యలను ప్రదర్శించడంలో టీవీ ప్రధాన భూమికను పోషిస్తున్నది. టీవీ ప్రసారాలు వివిధ సంస్కృతులను ఏకం చేయడం, ప్రపంచ వార్తలను క్షణాల్లో మన ఇంటికి చేర్చడం, విద్య బోధన, వినోదాల వడ్డింపు, సమాచారాన్ని చేరవేయడం, ప్రజలను అనుసంధానం చేయడం, మీడియా లిటరసీ, సామాజిక అభివృద్ధి, బ్రేకింగ్ న్యూస్ రూపంలో తాజా వార్తలను అందించడం, సాంస్కృతిక వినిమయం, ఆర్థిక ప్రగతికి బాటలు వేయడం, సాంస్కృతిక వికాసం, క్రీడల వృద్ధి, వినూత్న ప్రయోగాల క్షేత్రం లాంటి బహుళ ప్రయోజనాలను కలిగి ఉంటుంది. టీవీ ఆవిష్కరణలో ప్రధాన భాగంగా జాన్ లోగీ బైర్డ్, ఫిలో ఫెన్స్‌వర్థ కృషి మరువలేనిది. అత్యంత శక్తివంతమైన మాధ్యమంగా టీవీ నేడు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నది.

యువతకు ప్రేరణ అందించడం, పలు అంశాల్లో అవగాహన కల్పించడం, ప్రపంచ దర్శనానికి కిటికీ వలె టీవీ నిలుస్తున్నది. సమాజాన్ని సమన్వయ పరచడంతో పాటు సమాజ అద్దంగా టీవీ నిలువెత్తు రూపం నిలుస్తున్నది. ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం, సాంస్కృతిక వైవిధ్యాలను ప్రోత్సహించడం, దేశాల మధ్య సంబంధాలను పెంపొందించడం, పేదరిక నిర్మూలన లాంటి బహుళ ప్రయోజనాలు కలిగిన టీవీ లేని ఇళ్లు లేదని అవగతం అవుతున్నది.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారానే సమర్థవంతమైన నీటి నిర్వహణ సాధ్యం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ, నవంబర్ 20:ఇవాళ (నవంబర్ 18, 2025) న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో 6వ జాతీయ జల అవార్డులు, జల్ సంచయ్-జన్ భాగీదారీ అవార్డులను భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు.

నదీ పరివాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలు, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల చుట్టూనే మానవ నాగరికత అభివృద్ధి చెందిందని రాష్ట్రపతి అన్నారు. నదులు, చెరువుల వంటి నీటి వనరులను గౌరవించటం మన సంస్కృతి అని చెప్పారు. మన జాతీయ గేయంలోనూ బంకిం చంద్ర చటర్జీ రాసిన మొదటి పదం సుజలాం అనే.. దాని అర్థం నీటి వనరులు సమృద్ధిగా కలది అని, మనదేశం నీటికి ఇను_న్న ప్రాధాన్యతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా సమర్థవంతమైన నీటి వినియోగం తప్పనిసరని, మనదేశంలో నీటి యాజమాన్యం అత్యవసరమని రాష్ట్రపతి తెలిపారు. ఎందుకంటే భారత్‌లో జనాభాతో పోల్చితే నీటి వనరులు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. తలసరి నీటిలభ్యత అతి పెద్ద సవాలన్నారు. వాతావరణ మార్పులు జల చక్రాన్ని ప్రభావితం చేస్తున్నాయనీ, ఇలాంటి పరిస్థితుల్లో నీటి లభ్యత, నీటి భద్రతకు.. ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు.

గతేడాది ప్రారంభించిన జల్ సంచయ్-జన్ భాగీదారీ కార్యక్రమం ద్వారా 35 లక్షల ఇంకుడు గుంతలను నిర్మించటం పట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు.

పునరావృత నీటి ఆర్థిక వ్యవస్థ ద్వారా పరిశ్రమలు, ఇతర నీటి వినియోగదారులు జల వనరులను సమర్థంగా వాడుకోవచ్చని రాష్ట్రపతి తెలిపారు. నీటి శుద్ధి, పునర్వినియోగం ద్వారా పరిశ్రమలు ద్రవ వ్యర్థాలను విడుదల చేయటం పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు.

ఈ ప్రయత్నాలు నీటి నిర్వహణ, సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా పాలనా విభాగాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల స్థాయిలో నీటి సంరక్షణ, స్థిరమైన నిర్వహణకు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఎన్నో విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు ఈ దిశగా తమ వంతు సహకారం అందించటం పట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. నీటి వాడకాన్ని తగ్గించి, ఉత్పత్తిని పెంచే వినూత్న విధానాలను అవలంబించాలని రైతులు, పారిశ్రామికవేత్తలకు సూచించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే బాధ్యతా యుతమైన పౌరులు నీటి సంరక్షణలో కీలకమని ఆమె చెప్పారు.

వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారానే సమర్థవం తమైన నీటి నిర్వహణ సాధ్యమవుతుందన్నారు.

నీటిని ఉపయోగిస్తున్నప్పుడు, విలువైన ఆస్తిని వినియోగి స్తున్నామని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని రాష్ట్రపతి అన్నారు. గిరిజన ప్రజలు నీటితో పాటు అన్ని సహజ వనరులను ఎంతో గౌరవిస్తారని తెలిపారు. అత్యంత సమర్థవంతమైన నీటి నిర్వహణ ప్రజల జీవన విధానంలో కీలక భాగం కావాలని ఆమె స్పష్టం చేశారు. వ్యక్తిగతంగానూ, సమూహంగానూ నీటి సంరక్షణకు నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం పెంచేలా నీటి అవగాహన కల్పించటం అత్యవసరమని చెప్పారు. నీటిని సేకరించి, సంరక్షించటం ప్రజల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు.

నీటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించటం, ఉత్తమ నీటి వినియోగ పద్ధతులను పాటించేలా ప్రోత్సహించటమే జాతీయ జల అవార్డుల లక్ష్యం. ప్రజల భాగస్వామ్యం, వనరుల సమీకరణ ద్వారా కృత్రిమంగా భూగర్భ జలాలను పెంచటానికి వైవిధ్యమైన, విస్తరించగలిగే, పునర్వినియోగించగలిగే నమూనాల రూపకల్పనకు జల్ సంచయ్ జన్ భాగీదారీ (జేఎస్ జేబీ) కార్యక్రమం ఉపయోగపడుతుంది.

## ప్రపంచ వాతావరణ ఆర్థిక వనరుల ముఖచిత్రాన్ని మార్చడంలో భారత్ ముందున్న అవకాశాలు..

న్యూఢిల్లీ, నవంబర్ 20: ప్రపంచ వాతావరణ ఆర్థిక వనరుల ముఖచిత్రాన్ని మరింత పారదర్శకంగా, సార్వజనీన ప్రమాణాలతో మార్చడానికి భారత్ ముందున్న అవకాశాల గురించి కేంద్ర మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ ఒక వ్యాసాన్ని రాశారు. దీనిని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

వాతావరణ పరిరక్షణ విషయంలో ఆర్థిక సాయానికి సంబంధించి భారత్ అనుసరిస్తున్న వర్గీకరణ ముసాయిదా, దేశీయంగా హరిత ప్రధాన పథకాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం.. ఇవి భవిష్యత్తులో మరింత ఎక్కువ ప్రభావాన్ని చూపగలిగిన ప్రపంచవ్యాప్త విధానానికి మార్గదర్శకత్వం వహించగల ఉదాహరణలుగా నిలవగలుగుతాయని ఈ వ్యాసం తెలిపింది.

"వాతావరణ పరిరక్షణకు సంబంధించి ప్రపంచ దేశాలు అందిస్తున్న ఆర్థిక సాయానికి కొత్త రూపురేఖల్ని.. ఇప్పటి కన్నా ఎక్కువ పారదర్శకత్వంతో, ఉమ్మడి ప్రమాణాలతో సమకూర్చాల్సిన అవసరం ఎంతయినా ఉందని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ వివరించారు.

భారత్ అనుసరిస్తున్న వర్గీకరణ ముసాయిదా, దేశీయంగా హరిత ప్రధాన పథకాలకు చేస్తున్న ఆర్థిక సహాయం.. ఇవి భవిష్యత్తులో మరింత ఎక్కువ ప్రభావాన్ని చూపగలిగిన ప్రపంచవ్యాప్త విధానానికి మార్గదర్శకత్వం వహించగల ఉదాహరణలుగా నిలవగలుగుతాయన్నది ఆయన ఆలోచన" అని పేర్కొన్నారు.

# ఫిష్ ఫ్రై సెంటర్ మాటున కల్తీ దందా..?

-కల్లు లైసెన్స్ ఒకచోట దందా మరొకచోట..!
-సమాచారమిచ్చిన స్పందించని ఎక్సైజ్ సీఐ..?
-భారీగా ముడుపులు అందాయని ఆరోపణలు..?
-తెర వెనుక ఓ మాజీ ప్రజాప్రతినిధి..?
-నడి రోడ్డుపై ఈ గలీజ్ దందా..!



ఖమ్మం, నవంబర్ 20 (నేటనిజం ప్రతినిధి) :ఖమ్మం నడి ఒడ్డున బురహాన్ పురం రోడ్డు నందు గల రంభ వైన్స్ ఎదురుగా ఉన్న ఫిష్ ఫ్రై సెంటర్లో జోరుగా కల్తీ కల్లు, బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఒక దిన పత్రికలో కల్తీ కల్లు పై వార్త రావడంతో పోలీస్ బాస్ చొరవ తీసుకొని కల్లు తయారీ కేంద్రంపై కేసు నమోదు చేసి సీజ్ చేశారు. పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై కూడా ఎక్సైజ్ శాఖలో కదలిక లేకపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చిన కూడా ఎక్సైజ్ సీఐ పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెర వెనుక ఓ మాజీ ప్రతినిధి ఉండడంతో ఎక్సైజ్ అధికారులు జంకుతు న్నా రన్న ఆరోపణలు సైతం ఉన్నా యి. షాపు యజమాని ఎక్సైజ్ శాఖ నుండి ఒక ఇంటి నెంబర్ పై లైసెన్సు పొందిన ఇంటిలో దుకా ణం నిర్వహించాల్సి ఉండగా మరొక చోట అనగా ఫిష్ ఫ్రై సెం టర్లో దుకాణం నిర్వహిస్తున్నాడు. నడి రోడ్డుపై ఈ గలీజు దందా అర్థ రాత్రి 12 గంటల వరకు నిర్వహించడం వలన మందు బాబులు పండగ చేసుకుంటు న్నారు. మందు బాబుల వలన అక్కడ నివసించే పలు కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కల్లు కొట్టు యజమాని వెనుక మాజీ ప్రజా ప్రతినిధి హస్తం ఉండడంతో అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారనివిశ్వసనీయ సమాచారం..

# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం..



నిజామాబాద్, నవంబర్ 20: రైతును రాజుగా చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఈ రోజు బిక్కనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద 29 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అనంతరం ఏర్పాటు చేసినా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయం మార్కెట్ కమిటీలతో పాటు సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుం దన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం కొను గోలు చేసి సకాలంలో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వంఅందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ఉద్దేశంతో మహిళలకు పలు పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళా ద్వాక్రా సంఘంలో సభ్యురాలుగా ఉండాలన్నారు.

మహిళలకు ఇబ్బందులు లేకుండా ద్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రతి మహిళకు బొట్టు పెట్టి చీరను సారేగా అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పాలన ప్రణాళిక పద్ధతితో కొనసాగుతుందని చెప్పారు.కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ షట్కర్, రాష్ట్ర ప్రభుత్వ నిజామా బాద్ రూరల్ ఎమ్మెల్యే భూప తిరెడ్డి, సలహాదారులు షబ్బీర్ అలీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అడిషనల్ కలెక్టర్ విక్టర్, డిఆర్డిఏ పిడి సురే ందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నవంబరు 19న ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యటన

న్యూఢిల్లీ, నవంబర్ 20:నవంబరు 19న ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యటించనున్నారు.

ఉదయం 10 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా మహాసమాధి వద్ద ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళి అర్పిస్తారు. అనంతరం 10:30 గంటలకు, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జీవనం, ప్రబోధాలు, చిరకాల వారసత్వానికి గుర్తింపుగా స్టాంపులనూ, ఒక నాణేన్ని విడుదల చేస్తారు. జనసమూహాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

ఆ తరువాత, ప్రధానమంత్రి తమిళనాడులోని కోయం బత్తూరుకు పయనమవుతారు. అక్కడ మధ్యాహ్నం సుమారు ఒకటిన్నర గంటలకు దక్షిణ భారత ప్రక?తి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన సదస్సును ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా, దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు సహాయాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'పీఎం-కిసాన్' 21వ వాయిదా కింద రూ.18,000 కోట్లకు పైగా నిధుల్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేస్తారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

దక్షిణ భారత ప్రక?తి వ్యవసాయ సదస్సును తమిళనాడు నేచురల్ ఫార్మింగ్ స్టేక్‌హోల్డర్స్ ఫోరమ్ 2025 నవంబరు 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తుంది. పర్యవరణానుకూల సాగు పద్ధతుల్నీ, ప్రధానంగా రసాయనిక ఎరువులకు చోటులేని వ్యవసాయ పద్ధతుల్నీ దీర్ఘకాల ప్రాతిపదికన ప్రోత్సహించడం ఈ సదస్సు ధ్యేయం.

అలాగే, భారతదేశ వ్యవసాయ రంగానికి ఉజ్వల భవిష్యత్తును అందించడానికి ఆచరణీయ, రుతువుల ప్రభావాన్ని తట్టుకొనే, లాభసాటిగా ఉండే ప్రకృతి అనుకూల, పునరుత్పాదన ప్రధాన వ్యవసాయం దిశగా ముందుకు సాగడాన్ని వేగవంతం చేయాలనేది కూడా ఈ సదస్సు లక్ష్యం.

సేంద్రియ ఉత్పాదకాలు, అగ్రో-ప్రాసెసింగ్, పర్యావరణానుకూల ప్యాకేజి విధానాలు, దేశవాళీ సాంకేతికతలతో కూడిన నవకల్పనలను ప్రదర్శిం చడంపైనా, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికులకూ, ఫార్మర్-ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లకు మార్కెట్ లభ్యతపైనా ఈ శిఖరాగ్ర సదస్సు ప్రధానంగా దృష్టి పెడుతుంది.

ఈ శిఖ రాగ్ర సదస్సులో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన రైతులు, ప్రకృతి వ్యవసా యాన్ని అనుసరిస్తున్న వారు, శాస్త్రవేత్తలు, సేంద్రియ ఉత్పాద కాలను సరఫరా చేసే సంస్థల ప్రతినిధులు, అమ్మకందారులతో పాటు 50,000 మందికి పైగా ఆ న్ క త్ దా ం ౦ ు ల ు పాలుపంచుకుంటారు.

## రాష్ట్ర ఉత్తమ సొసైటీ అవార్డు

అమరావతి, నవంబర్ 20: 72వ ఆలిండియా కో-ఆపరేటివ్ సహకార వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొనకల్ సింగల్ విండో సొసైటీ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సొసైటీగా ఎంపికైంది.

ఈ మేరకు తెలంగాణ సహకార సంఘం రాష్ట్ర ప్రిన్సిపాల్ భూక్య వెంకన్నఎండీ అన్నపూర్ణ, డీసీఓ నంజీవరెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రశంసా పత్రాన్ని ఆ సొసైటీ చైర్మన్ అల్లం రవికి, కార్యదర్శి కావేటి రాజన్నకు హైదరాబాదులో ఈ రోజు అందజేశారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓసీ అందజేత..

పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో మంజూరైన (లెటర్ ఆఫ్ క్రెడిట్ ) ఎల్ ఓసీను మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. 41 వ డివిజన్, ప్రెసిడెంట్ వీధికి చెందిన సయ్యద్ ఖాజా భాష ( 50) క్యాన్సర్ తో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనకి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కొరకు దరఖాస్తు చేశారు. మంజూరైన రూ. 5 లక్షల 25 వేల ఎ.ఎల్. ఓ.సీను బాధితుడి సోదరుడికి అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్ ఓసీను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నేతలు వేంపలి గౌరీ శంకర్ , సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ఐఐటీఎఫ్‌లో కోల్ ఇండియా పెవిలియన్‌ను ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 20: న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్) 2025లో కోల్ ఇండియా (సీఐఎల్) పెవిలియన్‌ను కేంద్ర బొగ్గు, గనుల మంత్రి శ్రీ జీ కిషన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, సీఐఎల్ ఛైర్మన్ శ్రీ సనోజ్ కుమార్ ఝా, బొగ్గు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్ కాస్సీ, బొగ్గు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ లఖ్బత్ సింగ్ చౌధరితో పాటు బొగ్గు మంత్రిత్వ శాఖకు, సీఐఎలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంధన భద్రత, ప్రాజెక్టుల వైవిధ్యీకరణ, సుస్థిర విధానాల్లో భారత్ సాధించిన ప్రగతిని సీఐఎల్ పెవిలియన్ సందర్శకులకు వివరిస్తుంది. ఓపెన్ కాస్ట్ మైనింగ్ విధానం, బొగ్గు తవ్వకంలో కృత్రిమ మేధ వినియోగం, సీఐఎల్ అనుబంధ సంస్థల ప్రధాన కార్యాయలం వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పనితీరును ఈ పెవిలియన్ ప్రదర్శిస్తుంది. కార్యాచరణ సామర్థ్యం, భద్రతా ప్రమాణాల అమలును కృత్రిమ మేధ వినియోగం మెరుగుపరిచింది. పెవిలియన్లో ప్రధానంగా భద్రత, కార్యాచరణ శిక్షణను వర్చువల్ రియాలిటీ (వీఆర్) ద్వారా వీక్షించే ఏర్పాటు చేశారు. ప్రమాదకరమైన వాతావరణంలో సంప్రదాయ శిక్షణ పద్ధతులకు ప్రత్యామ్నాయంగా.. సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన, ఎక్కువ మందిని భాగం చేసే విధానాన్ని వీఆర్ అందిస్తుంది.

సీఎస్ఆర్ కార్యక్రమాలతో పాటు పర్యావరణ హిత బొగ్గు దిశగా భారత్‌ను నడిపించడంలో బొగ్గు మంత్రిత్వ శాఖ చేపట్టిన కీలకమైన గ్యాసిఫికేషన్ చర్య గురించి ఈ పెవిలియన్ ప్రత్యేకంగా వివరిస్తుంది. పర్యావరణ పునరుద్ధరణ నియమాలను నిలబెట్టే ఎకో-టూరిజం కార్యక్రమాలను సైతం ఇక్కడ ప్రదర్శిస్తారు.

లిథియం, కోబాల్ట్ లాంటి కీలకమైన ఖనిజాలను దేశీయంగా, అంతర్జాతీయంగా వెలికితీసేందుకు సీఐఎల్ అమలు చేస్తున్న వ్యూహాత్మక కార్యక్రమాలను సైతం వివరిస్తారు. ఈ కీలకమైన వనరుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, అలాంటి ఖనిజాలపై ఆధారపడిన పరిశ్రమల వృద్ధికి తోడ్పాటు అందించడమే లక్ష్యంగా ఈ విధానం నిర్దేశించుకుంది.

వాటాదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలతో అనుసంధానమయ్యేందుకు, పారదర్శకతను పెంపొందించేందుకు, దేశ నిర్మాణంలో తన పాత్రను వివరించేందుకు సీఐఎల్‌కు మంచి వేదికగా ఐఐటీఎఫ్ పనిచేస్తుంది. ఇంధన భద్రతకు భరోసా ఇవ్వడానికి, సుస్థిరమైన, స్వావలంబన సాధించిన వృద్ధి దిశగా భారత్ ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఐఎల్ కట్టుబడి ఉన్నాయి.



# ప్రపంచంలో అగ్ర శ్రేణి దేశంగా భారత్‌ను మార్చనున్న అంతరిక్ష రంగం: డా. జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 20:ప్రపంచంలోనే అగ్రశ్రేణి దేశంగా భారత్‌ను అంతరిక్ష రంగం నిలబెడుతుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచ అంతరిక్ష వేదికపై భారత్ పాత్ర పెరుగుతుందన్న కేంద్ర మంత్రి.. అంతరిక్ష రంగంలో కార్యకలాపాలు, పెట్టుబడికి ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా దేశం ఎదుగుతోందని అన్నారు. ఇటీవల నెలల్లో దేశాన్ని సందర్శిస్తున్న అనేక అంతర్జాతీయ ప్రతినిధి బృందాలు నుంచి పెరుగుతోన్న ఆసక్తే దీనికి నిదర్శనమని ఆయన తెలిపారు.

భారతదేశ అంతరిక్ష రంగం ఒక నిర్ణయాత్మక పరివర్తనకు లోనవుతోందని డా. జితేంద్ర సింగ్ అన్నారు. ఈ సంవత్సరం ఇండియా ఇంటర్నేషనల్ స్పేస్ కాంక్లేవ్ (ఐఐఎస్‌సీ- 2025) ఇతివృత్తం అయిన "విస్తరిస్తున్న పరిధి: నూతన అంతరిక్ష యుగంలో ఆవిష్కరణ, సమ్మిళితత్వం, ధృడత్వం'' నేరుగా దీనిని తెలియజేస్తోందని ఆయన పేర్కొన్నారు. భారత అంతరిక్ష సంఘం (ఐఎస్‌పీఏ- ఇండియన్ స్పేస్ అసోసియేషన్) నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమల నాయకులు, అంతర్జాతీయ సంస్థలు, దౌత్యవేత్తలు, అంకురాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతిభావంతులు, సాంకేతికత, పెట్టుబడి కలిసి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుకు రూపకల్పన చేసే ఒక అనుకూల వ్యవస్థను ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సృష్టించాయని అన్నారు.

ఐఐఎస్‌సీ-2025 ఇతివృత్తాన్ని 'చాలా ఆలోచనాత్మకంగా రూపొందించారన్న' కేంద్ర మంత్రి ఇది భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష వ్యవస్థకు ఉన్న కొత్త శక్తిని తెలియజేస్తోందని అన్నారు. దేశానికి శాస్త్రీయ సామర్థ్యం ఎల్లప్పుడూ ఉన్నప్పటికీ ఆవిష్కరణ, విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే వాతావరణాన్ని విధాన నిర్ణేతలు సృష్టించినప్పుడే పురోగతి దిశ మారిందని మంత్రి అన్నారు. 2019 నుంచి తీసుకువచ్చిన సంస్కరణలో భాగంగా అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతినివ్వటం, 'ఇన్-స్పేస్' ను ఏక-గవాక్ష నియంత్రణ సంస్థగా స్థాపించడం, 2023లో అంతరిక్ష విధానాన్ని విడుదల చేయడం లాంటివి.. ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ పాత్ర విస్తరించేందుకు సహాయ పడ్డాయని తెలియజేశారు.

ఇతివృత్తంలో ఉన్న 'సమ్మిళితత్వం' అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించిన కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి.. అంతరిక్ష రంగ ద్వారాలు తెరవడం వల్ల అంకురాలు, విద్యార్థులు, పరిశ్రమలు, ప్రజలు వచ్చారని అన్నారు. ఇప్పుడు వేలాది మంది ప్రజలు రాకెట్ ప్రయోగాలను ప్రత్యక్షంగా చూస్తున్నారు.. కేవలం కొన్ని సంవత్సరాలలోనే 300 కంటే ఎక్కువ అంతరిక్ష అంకురాలు వచ్చాయి. వీటిలో చాలా అంకురాలు విదేశీ పెట్టుబడులను కూడా పొంది వేగవంతమైన వృద్ధి సాధించాయి. చాలా కాలంగా ఉపయోగించుకోకుండా ఉన్న ఔత్సాహిక ప్రతిభావంతుల సామర్థ్యాన్ని ఇది తెలియజేస్తోంది.

ఆవిష్కరణల గురించి మాట్లాడిన డా. జితేంద్ర సింగ్.. చంద్రుడి దక్షిణ ధ్రువం లో చంద్రయాన్ దిగటం, చంద్రుడిపై నీటి ని కనుగొనటం నుంచి మొదలు కొని మంగళయాన్ మిషన్ విజయం సాధించటం, ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించడం వరకు భారతదేశ విజయాలను ప్రస్తావించారు. అంతరిక్ష సాంకేతికతను పాలన, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించడమే ఈ రంగానికి భారత్ అందించి గొప్ప తోడ్పాటని అన్నారు. దేశ అంతరిక్ష అనువర్తనాలలో దాదాపు 70 శాతం ఇప్పుడు జీవన సౌలభ్యానికి సహాయ పడుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రణాళిక కోసం గతి శక్తి, భూభాగాల మ్యాపింగ్ కోసం స్వామిత్వ, ఉపగ్రహ ఆధారిత విపత్తు నిర్వహణ, మారుమూల ప్రాంతాలలో టెలిమెడిసిన్, అడ్డంకులను ముందుగానే గుర్తించగల రైల్వే భద్రతా వ్యవస్థలు వంటి వాటిని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు.

ఈ విధానం ధృఢత్వాన్ని కూడా పెంచిందని డా. జితేంద్ర సింగ్ అన్నారు. ఇది ఐఐఎస్‌సీ ఇతివృత్తానికి సంబంధించిన మరో ముఖ్యమైన అంశమని తెలిపారు. ఉపగ్రహ ఆధారిత సేవలిప్పుడు దేశవ్యాప్తంగా విపత్తు ప్రతిస్పందన, వ్యవసాయం, వాతావరణ అంచనా, అనుసంధానతకు సహాయ పడుతున్నాయని తెలిపారు. ఈ సామర్థ్యాలను భారత్ పొరుగు దేశాలకు కూడా విస్తరిస్తోందన్న ఆయన.. భూటాన్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్, మయన్మార్ దేశాలకు మన ఉపగ్రహాలు మద్దతు ఇసున్నాయన్నారు.

జపాన్, ఇటలీ, ఇతర అనేక దేశాల ప్రతినిధి బృందాలు భారత అంతరిక్ష రంగంపై విశ్వాసం చూపించాయని.. ఇది అంతరిక్ష భాగస్వామ్యాల విషయంలో ప్రాధాన్య ప్రపంచ గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. అంతరిక్షం, అణు శక్తి వంటి వ్యూహాత్మక రంగాలలో చాలా కాలంగా ఉన్న అడ్డంకులను తొలగించి భారత్ అంతర్జాతీయంగా విస్తరించేలా అవసరమైన విధాన వాతావరణాన్ని సృష్టించిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.

మంత్రిత్వ శాఖలు, పరిశ్రమలు, అంతరిక్ష సంస్థలు, పెట్టుబడిదారులు, అంకురాలు, విద్యావేత్తలను ఐఐఎస్‌సీ ఒకచోట చేర్చినందున?, సమ్మిళిత, ధృడమైన అంతరిక్ష వ్యవస్థను నిర్మించే దిశగా భారత్ చేస్తోన్న ప్రయత్నాలను ఈ చర్చలు వినూత్న మరింత బలోపేతం చేస్తాయని డా. జితేంద్ర సింగ్ అన్నారు. రాబోయే సంవత్సరాల్లో అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఐదు రెట్లు పెరిగే అవకాశం ఉందన్న ఆయన.. ఈ సంవత్సరం ఇతివృత్తంలో ఉన్న దార్శనికతకు అనుగుణంగా ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత బలమైన స్థానాన్ని పొందేందుకు భారత్ సిద్ధంగా ఉందంటూ ప్రసంగాన్ని ముగించారు.

# మనసేవ సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం..

అమరావతి, నవంబర్ 20: మండల కేంద్రంలో మన సేవా సమితి(ఓజీనిజీ ావలజీ ాజీఎతిబితి ఆధ్వర్యంలో ఈ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మన సేవా సమితి ప్రతినిధులు తెలిపారు.

అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అన్న ప్రసాదానికి విరాళాలు ఇచ్చే దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

# ఒప్పందం లేకుండా పంటలు వేయొద్దు



అమరావతి, నవంబర్ 20:ఈ యాసంగి సీజన్లో విత్తన ఏజెన్సీ లతో ఒప్పందం లేకుండా మొక్కజొన్న, వరి పంటలు వేసుకోవద్దని మండల వ్యవసాయ అధికారి కళ్యాణి రైతులకు సూచించారు. ఈ రోజు మండలంలో మొక్కజొన్న 3500 ఎకరాలు, వరి 6500 ఎకరాలురైతులు సాగు చేస్తున్నారని అన్నారు.

కాగ ఆసిరెడ్డిపల్లి గ్రామంలో విత్తన ఉత్పత్తి మొక్కజొన్న వరి సాగు చేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్న వరి పంటలు సాగు చేసే రైతులు ఒప్పంద పత్రాలు చేసుకున్న తర్వాతనే మొక్కజొన్న వరి పంటలు సాగు చేయాలని అన్నారు.

ఎవరైనా నమ్మకంతో విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని తెలిపారు. మండలంలో మొక్కజొన్న వరి ఏజెంట్స్ గ్రామాలలో తిరిగి వేయించడానికి ముందుగా కొంత పెట్టుబడి సాయం రైతులకు ఇచ్చి రైతులకు వారి రైతులుగా నమోదు చేసుకుంటున్నారని అన్నారు. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా పడటం వల్ల పత్తి ఆశించిన దిగుబడి రాకపోవడం, రైతులు మొక్కజొన్న సాగు వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

అగ్రిమెంట్ ఇస్తేనే వరి మొక్కజొన్న పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. అగ్రిమెంటు లేకుండా సాగు చేస్తే రైతులకు విత్తనం వల్ల పంట నష్టం వాటిల్తే న్యాయపరంగా లబ్ధి పొందలేరని, తప్పనిసరిగా అగ్రిమెంటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు భరత్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి విద్యార్థులే రేపటి నవ సమాజ నిర్మాతలు

### -జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి

అమరావతి, నవంబర్ 20: నేటి విద్యార్థులే రేపటి నవ సమాజ నిర్మాతలని జిల్లా విద్యా శాఖ అధికారి దక్షిణామూర్తి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోదుగుల గూడెం నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సత్య నారాయణచారి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తక పంపిణీ కార్యక్రమం జరిగినది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యా శాఖ అధికారి దక్షిణామూర్తి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి దాత.బొల్లం శ్రీనివాస్ చేసిన సహకారం అభినందనీయమని, దానిని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులు సమయస్ఫూర్తితో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

జిల్లా సైన్స్ అధికారి అప్పారావు మాట్లాడుతూ సమయం వృధా చేయకుండా విద్యార్థులకు ఇచ్చిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పరీక్షల నాటికి రెండు దఫాలుగా రివిజన్ చేయాల్సిన అవసరం ఉందని దాని ద్వారా అత్యధిక మార్కులు సాధించి మంచి ఫలితాలు సాధిస్తారని హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో దాత బొల్లం.శ్రీనివాస్ బలాస్టి రమేష్, మైన శ్రీనివాసులు, చుంచు. శ్రీశైలం, లత, ఇందిరా, దీపిక, రజిత, రచ్చ వెంకన్న, రమేష్, విజయ్ కుమార్, లక్ష్మ, దార్ల సునీల్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి క్వాంటమ్ వ్యాలీలో (ఏక్యూవీ) కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకున్న సీ-డాట్

న్యూఢిల్లీ, నవంబర్ 20:అమరావతి క్వాంటమ్ వ్యాలీలో (ఏక్యూవీ) పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్) అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. కేంద్ర ప్రభుత్వంలోని టెలికమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన టెలికాం పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రమే ఈ సీ-డాట్. ఇది దేశానికి ఉన్న వ్యూహాత్మక, సామాజిక-ఆర్థిక అవసరాలను తీర్చడానికి స్వదేశీ టెలికాం పరిష్కారాల రూపకల్పన -అభివృద్ధి, అత్యాధునిక కమ్యూనికేషన్ సాంకేతికలను ఉపయోగించేలా చూసుకునే పనిలో నిమగ్నమై ఉంది. ఇప్పుడు క్వాంటమ్ భద్రతా పరిష్కారాల అభివృద్ధి విషయంలో కూడా సీ-డాట్ మార్గదర్శకత్వం వహిస్తోంది. వీటిని ఇప్పటికే ప్రముఖ విద్యా సంస్థలు, ప్రభుత్వ పరిశోధన - అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సంస్థలు, ప్రత్యక్ష ట్రాపిక్ ఉన్న వాస్తవ నెట్‌వర్క్ తదితరాల్లో ఉపయోగిస్తున్నారు.

భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు రూపొందించటంలో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీని (ఏక్యూవీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమరావతిలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర స్థాయి భాగస్వామ్యాలు, మౌలిక సదుపాయాలు, శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయి. హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నైపుణ్యాలను పెంపొందించటం, పరిశోధనను పెంచటం ద్వారా ఒక సమగ్ర క్వాంటమ్ వ్యవస్థను సృష్టించాలని అమరావతి క్వాంటమ్ వ్యాలీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీ-డాట్ మధ్య కుదిరిన ఈ ఒప్పందంలో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో క్వాంటమ్ కమ్యూనికేషన్- సెక్యూరిటీ సొల్యూషన్స్ విభాగంలో గోప్యతను మెరుగుపరిచే సాంకేతికతలు(పీఈటీ- ప్రైవసీ ఎన్‌హాన్స్‌మెంట్ టెక్నాలజీస్) వంటి అనుబంధ అంశాలతో కూడిన ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సీ-డాట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదిత కేంద్రంలో ప్రధానంగా క్వాంటమ్ కమ్యూనికేషన్ పరిష్కారాలపై డీ-డాట్ దృష్టి సారించనుంది.

క్వాంటమ్ కమ్యూనికేషన్ రంగంలో సీ-డాట్‌కు ఉన్న నైపుణ్యం.. భారత్‌లోని వర్ధమాన సంస్థలకు అవసరమైన వనరులు, నైపుణ్యాభివృద్ధిని అందించడంలో సహాయపడుతుంది.

ఇది 'ఎన్ క్యూఎం' (నేషనల్ క్వాంటమ్ మిషన్)కు అనుగుమంగా ఉన్న క్వాంటమ్ భద్రతా పరిష్కారాల విషయంలో పరిశోధన, ప్రయోగాలకు మద్దతునిస్తుంది. దీనితో పాటు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీ డీపీ) ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా ఉండేలా పీఈటీల అభివృద్ధికి కూడా ఇది సహాయపడుతుంది. క్వాంటమ్ కమ్యూనికేషన్ వ్యవస్థల కోసం తక్కువ ఖర్చుతో కూడిన విడి భాగాల అభివృద్ధిపై కూడా డీ-డాట్ దృష్టి సారిస్తుంది. వీటితో పాటు క్వాంటమ్ భద్రత కోసం ఒక సమగ్ర టెస్ట్‌బెడ్‌ను ఇది ఏర్పాటు చేస్తుంది. ఇది ఏక్యూవీ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేయటంతో పాటు క్వాంటమ్ సాంకేతికతను సురక్షితంగా ఉపయోగించగలిగే వ్యవస్థను ప్రోత్సహించి, దేశవ్యాప్తంగా డిజిటల్ గోప్యత - డేటా రక్షణను పెంచుతుంది.

విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందాన్ని మార్చుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఈ-సీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ - కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి శ్రీ భాస్కర్ కాటమనేని సమక్షంలో సీ-డాట్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు డాక్టర్ పంకజ్ కుమార్ దలేలా అవగాహన ఒప్పందంపై (ఎంఓయూ) సంతకం చేశారు.

# ఫ్యాక్టరీ ప్రారంభానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

### -త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభం
### -పనులను పరిశీలించిన కలెక్టర్

సిద్ధిపేట, నవంబర్ 20: ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల ను పూర్తి చేయాలని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. సిద్ధిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మెటలో రూ.300 కోట్లతో నిర్మాణం చేస్తున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని గురువారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్, డ్రైనేజీ నిర్మాణాల వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రహదారి వెంబడి చెట్ల పొదలు తొలగించాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వివిధ జిల్లాల నుండి తరలివచ్చే ప్రజల వాహనాలను నిలిపేందుకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. వాహనాలను నిలిపేందుకు ఫ్యాక్టరీ పక్కన గల టీజీఐఐసీ స్థలన్ని చదును చెయ్యాలని తెలిపారు. వీఐపీ వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని చెప్పారు.

ముఖ్యమంత్రి ఫ్యాక్టరీ ప్రారంభం కోసం వచ్చే హెలి కాప్టర్ దిగేందుకు అవసరమైన హెలి ప్యాడ్ సిద్ధం చేయాలని రహదారులు భవనాల అధికారులను ఆదేశించారు. ముఖ్య మంత్రి పర్యటనకు అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి సంబంధించిన పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బంది గా సిద్ధం చేయాలని ఆయిల్ ఫెడ్ అధికారులను ఆదేశం చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రారంభానికి ఫ్యాక్టరీని సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

### -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి




నంద్యాల, నవంబర్ 20: కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపించిన, పర్యవేక్షణ కరువైన సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని.. నాణ్యత లోపంగా పనులు చేసే కాంట్రాక్టును కూడా బ్లాక్ లిస్టులో ఉంచుతామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి హెచ్చరించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పర్యవేక్షణలో నంద్యాల దిశా కమిటీ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర అభివృద్ధికి నిధులు రాబట్టేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎంత శ్రామిసు న్నారో ఎంపీలుగా మాకు తెలుస్తోందన్నారు.

అన్ని శాఖల అధికారులు వీటిని గమనించి మన నంద్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు దుర్వినియోగం కాకుండా, నిరంతర పనుల పర్యవేక్షణ, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, సకాలంలో పనులు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. మనకు కేంద్రం ఇచ్చిన నిధులు సకాలంలో ఖర్చు చేస్తే ఇంకా ఎక్కువ నిధులు వచ్చేందుకు అవకాశం ఉందని.. ఇది అధికారులు గుర్తించి పనులు చేయాలని ఆమె కోరారు. అన్ని శాఖల అధికారుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు.

దిశా సమావేశంకు జాతీయ రహదారుల అధికారులు రాకపోవడం పట్ల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్కువ ఫిర్యాదులు ఆ రెండు శాఖల నుంచే వస్తున్నాయని.. జిల్లా కలెక్టర్ ద్వారా త్వరలో ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల అధికారులతో ఈ నెలాఖరులోనే సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. 82 కేంద్ర ప్రభుత్వ పథకాలపై దిశా సమావేశంలో సమీక్షా నిర్వహించినట్లు ఆమె వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల, అధికారుల సహకారం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల, అధికారుల సహకారం ఎంతో అవసరం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పాఎి రెడ్డి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, రాష్ట్రస్థాయి దిశా కమిటీ సభ్యులు నూకల సుస్మిత, పవన్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, ఎల్లాల బాబు, డాక్టర్ బాబన్ డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, డీఆర్ఓ రాము నాయక్, జిల్లా అధికారులు, ప్రజాప్రతిని ధులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిది పేదలకు వరం..

వరంగల్, నవంబర్ 20: ఆపదలో ఉన్న పేదలకు ముఖ్య మంత్రి సహాయనిధి వరంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఎన్నో వేలాది పేద, మధ్య తర గతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోం దన్నారు.

రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ ప్రజల సంక్షేమవే ప్రభుత్వ ధ్యేయంగా చేసుకొని ముందు అడుగేస్తుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఉద్ఘాటించారు. హనుమకొండ, కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఈ రోజు సీఎం సహాయనిధిచెక్కులను డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.

సీఎం సహాయనిధి కింద 11 మంది లబ్ధిదారులకు 6 లక్షల 25 వేల విలువైన చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు సీఎం సహాయనిది పథకాన్ని సద్విని యోగం చేసుకొని ప్రయోజనం పొందాలని సూచించారు.

సీఎం సహాయనిధి అందేలా కృషి చేసినందుకు డాక్టర్ కడియం కావ్యకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతిని ధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై దర్యాప్తు వేగవంతం

తిరుపతి, నవంబర్ 20:తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై నమోదైన కేసు దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందం వేగవంతం చేసింది. ఈ క్రమంలో టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే సుమారు మూడున్నర గంటల పాటు ప్రశ్నించారు.

ఈ కేసులో ఇప్పటికే సుబ్బారెడ్డి పీఏ.. చిన్న అప్పన్నను అరెస్ట్ చేసిన సిట్, అతని ఎకౌంట్‌లో జమ అయిన నాలుగు కోట్ల రూపాయల మూలంపై కీలక సమాచారాన్ని సేకరిస్తోంది. అప్పన్న వాంగ్మూలంలో బయటపడిన వివరాల ఆధారంగానే సిట్ ఇప్పుడు సుబ్బారెడ్డిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

ఇటీవల సిట్, విచారణ కోసం విజయవాడకు రావాలని సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేసింది. అయితే తాను హాజరు కాలేనని తెలిపిన నేపథ్యంలో, విచారణ బృందం స్వయంగా హైదరాబాద్ చేరుకుని ఆయన నివాసంలోనే విచారణ కొనసాగించింది.

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో లడ్డూ తయారీకి నెయ్యి సరఫరా చేసిన కంపెనీలు, కుదిరిన కాంట్రాక్టులు, ఛైర్మన్ హోదాలో తీసుకున్న నిర్ణయాలు వంటి అంశాలపై సిట్ సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. సుబ్బారెడ్డి విచారణ పూర్తైన తర్వాత కేసులో మరిన్ని కీలక పరిణామాలు వెలుగులోకి వచ్చే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఆహ్వానం
cohance lifesciences సౌజన్యం
మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణా సారథ్యం
జిల్లా యంత్రాంగం సహకారం
జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు 2025
కవులు రచయితలు కళాకారులు కార్టూనిస్టుల ఆత్మీయ సమ్మేళనం
ముఖ్యఅతిథులు
శ్రీ కందుల దుర్గేష్ గారు
ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు
శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు
అవనిగడ్డ శాసనసభ్యులు, తెలుగు భాషోద్యమ సారథి
డా॥ లక్ష్మీశ ఐఎఎస్ గారు
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్
గౌరవ అతిథి
శ్రీ రేగుళ్ళ మల్లికార్జునరావు గారు
సీఈవో-ఏపీ సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి
కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు
ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గారు, డా॥ పాపినేని శివశంకర్ గారు
పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ తెలుగు & సంస్కృత అకాడమీ అధ్యక్షులు శ్రీ ఆర్.డి.విల్సన్ @శరత్ చంద్ర గారు
సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు శ్రీ జి.లక్ష్మీనరసయ్య గారు అతిథులుగా హాజరవుతారు.
నవంబరు 22, 23 తేదీలు శని, ఆదివారాలు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం, విజయవాడ
మొదటి రోజు
22-11-2025 శనివారం
సాయంత్రం 3.00 గంటలకు
రెండవ సభ
సభాధ్యక్షులు
గౌ॥ కళారత్న శ్రీ బిక్కి కృష్ణ
నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు
ముఖ్య అతిథులు
గౌ॥ గజల్ మాస్ట్రో డా॥ గజల్ శ్రీనివాస్
ట్రిపుల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్సు గ్రహీత
గౌ॥ ఆచార్య డి. మునిరత్నం నాయుడు
పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఉపకులపతి
రాజమహేంద్రవరం
విశిష్ట అతిథి
గౌ॥ ఆర్.డి.విల్సన్ @ శరత్ చంద్ర
ఏపీ తెలుగు & సంస్కృత అకాడమీ అధ్యక్షులు
వక్తలు
డా॥ జి.వి.పూర్ణచంద్
ప్రధాన కార్యదర్శి, కృష్ణాజిల్లా రచయితల సంఘం
గౌ॥ డా॥ జెల్ది విద్యాధరరావు, ఐ.ఆర్.ఎస్
సుప్రసిద్ధ కవి, విమలసాహితి వ్యవస్థాపకులు
గౌ॥ డా॥ రావి రంగారావు
వ్యవస్థాపకులు-అమరావతి సాహితీ మిత్రులు
గౌ॥ తూమాటి సంజీవరావు
చెన్నపురి తెలుగు అకాడమీ మేనేజింగ్ ట్రస్టీ

# కృత్రిమ మేధపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు 'యువ ఏఐ ఫర్ ఆల్' అనే ఉచిత జాతీయ కోర్సును ప్రారంభించిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్ 20:కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచాన్ని భారత్ లో అందరికీ, ముఖ్యంగా యువతకు పరిచయం చేసే లక్ష్యంతో ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై) 'ఇండియాఏఐ' మిషన్ కింద, మొట్టమొదటిసారిగా 'యువ ఏఐ ఫర్ ఆల్' ఉచిత కోర్సును ప్రారంభించింది.

విద్యార్థులు, , నిపుణులు, ఇతర ఆసక్తిగల అభ్యాసకులు నాలుగైదు గంటల స్వల్ప వ్యవధిలో సులభంగా ఏఐ ప్రాథమిక అంశాలను తెలుసుకోవడానికి, ఇది ప్రపంచాన్ని ఎలా మారుస్తుందో అవగాహన పొందడానికి వీలుగా ఈ కోర్సును రూపొందించారు. ఇది సులభంగా, ఆచరణాత్మకంగా ఉంటుంది. దీనిని నేర్చుకోవడంలో ఆసక్తి, ఉత్సాహం కోసం కోర్సులో నిజ జీవిత భారతీయ ఉదాహరణలను జోడించారు.

ఈ కోర్సు ప్రముఖ అభ్యసన వేదికలైన ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్, ఐగాట్ కర్మయోగి, ఇతర ప్రముఖ ఎడ్ - టెక్ పోర్టల్స్‌లో ఉచితంగా అందుబాటులో ఉంది.కోర్సును పూర్తి చేసిన ప్రతి అభ్యాసకుడికి భారత ప్రభుత్వం నుంచి అధికా రిక సర్టిఫికెట్ లభిస్తుంది.

ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమం ద్వారా కోటి మంది పౌరులకు మౌలిక ఏఐ నైపుణ్యాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది దీని ద్వారా డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, నైతిక ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడం, భారతీయ పనివారిని భవిష్యత్తుకు సిద్ధం చేయడం సాధ్యమవుతుంది.

ఈ కోర్సును దేశంలోని ప్రతి మూలకు చేర్చడానికి సంస్థలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ఇండియాఏఐ తో భాగస్వామ్యం చేసుకోవచ్చు. భాగస్వామ్య సంస్థలు ఈ కోర్సును అనుసంధానం చేయడంతో పాటు, అభ్యాసకుల కోసం ప్రచారం చేయవచ్చు. సర్టిఫికెట్‌లను కో-బ్రాండ్ చేయవచ్చు.

ఇండియా ఏఐ మిషన్ కోసం, ప్రముఖ ఏఐ నిపుణుడు, రచయిత, ఏఐ అండ్ బియాండ్, టెక్ విస్పరర్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు జస్ప్రీత్ బింద్రా ఈ కోర్సును తయారు చేశారు. ఈ కోర్సు ప్రపంచ పరిజ్ఞానాన్ని భారతదేశ నేపథ్యంతో మేళవించి, నైతిక, బాధ్యతాయుత, సమ్మిళిత ఏఐ వినియోగంపై దృష్టి పెడుతుంది.

# ఇద్దరికి గాయాలు

## పెరుగుతున్న కుక్క కాటు బాధితులు- పట్టించుకోని అధికారులు

నారాయణపేట జిలా నవంబర్ 20: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం ఊట్కూర్ మండల కేంద్రంలోని భరత్ నగర్ వీధికి చెందిన మమ్మద్ హర్షాన్ అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కకాటు వేసింది. అలాగే పాతపేట వీధికి చెందిన స్వాతి ఇంటి ముందు ఉండగా కుక్క దాడి చేసి కరిచింది.

దీంతో బాధితులు ఊట్కూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేసుకున్నారు. కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడి చేస్తుండడంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటికి వచ్చేందుకు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కలను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

# డ్రగ్స్ సైబర్ క్రైమ్ పై అవగాహన..



తిరుపతి, నవంబర్ 20: చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని నాగయ్య కళాక్షేత్రంలో డ్రగ్స్, సైబర్ క్రైమ్ పై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో కేఎల్ యూనివర్సిటీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో వివేకానంద జూనియర్ కాలేజ్‌కు చెందిన దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్నారు. డీఎస్పీ, 1 టౌన్, 2 టౌన్, క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, యువత ప్రవర్తనలో జాగ్రత్తలు వంటి అంశాలపై వివరించారు. పోలీసులు ప్రదర్శించిన ఖఖు స్లైడ్స్, వీడియోలు విద్యార్థుల్లో లోతైన అవగాహన కలిగించాయి.

డీఎస్పీ సాయినాథ్ డ్రగ్స్ వలన శరీరానికి, మెదడుకు, కుటుంబానికి జరిగే భయంకర పరిణామాలను వివరించారు. డ్రగ్స్ మెదడు పనితీరును దెబ్బతీస్తాయని, జ్ఞాపకశక్తి తగ్గి నిర్ణయశక్తి కోల్పోతుందని చెప్పారు. హృదయ సమస్యలు, లివర్ వైఫల్యం, ఊపిరితిత్తుల దెబ్బతినడం వంటి తీవ్రమైన రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఒకరి వ్యసనం కుటుంబం మొత్తం ఆర్థిక సామాజికంగా దెబ్బతింటుందని ఉదాహరణలతో వివరించారు. డ్రగ్స్ నేరాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర మొబైల్, ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా వాడకంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. తెలియని లింకులు, ఫిషింగ్ మెసేజెస్, గుుఖ మోసాలు, నకిలీ ప్రొఫైల్స్‌పై హెచ్చరించారు.

చిన్న తప్పిదం కూడా తీవ్రమైన సమస్యలకు దారితీస్తుందని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, నంబర్లు సోషల్ మీడియాలో పబ్లిక్ చేయరాదని సూచించారు. 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య విద్యార్థి జీవితంలో మంచి ప్రవర్తన, సరైన సంబంధాలు, నిర్ణయాల ప్రాధాన్యత గురించి మాట్లాడారు. డ్రగ్స్, సోషల్ మీడియా వ్యసనం యువతను లక్ష్యాల నుంచి దూరం చేస్తుం దని, తమ చుట్టూ ఉన్న వారు భవిష్యత్తును ప్రభావితం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వినయం, క్రమశిక్షణ పాటించి సమస్యలను తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తల్లిదండ్రులు పిల్లల మధ్య రోజువారీ సంభాషణ ముఖ్యమని చెప్పారు.

పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఒత్తిడులు గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. తాజాగా పెరుగుతున్న 'డిజిటల్ అరెస్టు' సైబర్ మోసం గురించి హెచ్చరిస్తూ, పోలీసులు ఎప్పుడూ ఫోన్‌లో అరెస్ట్ చేయరని, డబ్బులు అడగరని స్పష్టం చేశారు. డ్రగ్ వ్యసనం ప్రారంభ లక్షణాలు గమనించిన వెంటనే సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో విస్తృత స్పందనను రేపగా, భవిష్యత్‌లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

# 80 కోట్ల మందికి ఉచితబియ్యం



నల్గొండ, నవంబర్ 20: ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతినెల 5 కిలోల ఉచిత బియ్యాన్ని ఇస్తున్నట్లు కేంద్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.

ఈ రోజు అయన నల్గొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికి 5 కిలోల చొప్పున 80 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నామని, ఇది 2030 వరకు ఇది కొనసాగించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రపంచంలో ఏ దేశంలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ప్రతినెల 5 కిలోల బియ్యం ఇవ్వటం లేదని అన్నారు. ఆస్ట్రేలియా, జర్మనీ యూరోపియన్ దేశాలలో సైతం ఇలాంటి పద్ధతి లేదని, భారత ప్రజా పంపిణీ వ్యవస్థను చూసి ఇతర దేశాలు ఆశ్చర్యపోతున్నాయని, ప్రపంచంలోనే భారత ఆహార భద్రత పథకం మోడల్ గా తీసుకురావడం జరిగిందని ఆయన వెల్లడించారు.

ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్సిఐ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆ తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి

## -బీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నారమోని నరేష్ యాదవ్

అమరావతి, నవంబర్ 20: స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల పై రాష్ట్ర ప్రభుత్వం తీసు కున్న తాజా నిర్ణయాలు బీసీ వర్గాలపై మరోసారి అన్యాయంగా మారుతున్నాయని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నారమోని నరేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధత పొందిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలను నిర్వహించడం సరైన పద్ధతి అని స్పష్టం చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు పార్టీల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలనే సూచనలు చేయడం పూర్తిగా అసంబద్ధమని ఆయన విమర్శించారు.

సర్పంచ్ ఎన్నికలు పార్టీ గుర్తులు లేకుండా నిర్వహించే సంద ర్భంలో పార్టీ ఆధారిత రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది బీసీలపై మరోసారి మోసం చేయాలనే ప్రయత్నంగా కనిపిస్తోందని నరేష్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు కాకుం డానే ఎన్నికలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు తప్పవని హెచ్చరించారు. బీసీలను మసి పూసి మారేడు కాయలు చేసినట్టు మోసం చేయాలని చూస్తున్న రాజకీయ పార్టీల అసలు స్వరూపం ప్రజలకు అర్థ మైపోయిందని, రాబోయే రోజు ల్లో అటువంటి పార్టీలను బీసీ వర్గాలు పాతరేస్తాయని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభు త్వం వెంటనే ఈ నిర్ణయా న్ని వెనక్కి తీసుకుని, రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేసిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు జరిపించాలని బీసీఫ్ నాయకుడు డిమాండ్ చేశారు.

# ఆకస్మిక అంబులెన్స్ తనిఖీ..

నిజామాబాద్, నవంబర్ 20: కమ్మర్ పల్లి మండల కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించే 108 అంబులెన్స్‌ను 108కి సంబంధించిన ఉన్నత అధికారులు ఈ రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ రామలింగేశ్వర రెడ్డిరికార్డులను తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు, వైద్య పరికరాలు వాటి స్థితిగతులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి నిల్వలు చూసి రికార్డులను పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగిన అత్యవసర పరిస్థితుల్లో అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని, గర్భిణులను ప్రసవ సమయంలో ఆసుపత్రికి అంబులెన్స్‌లోనే తరలించేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. అలాగే రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరును అభినందించారు. సిబ్బంది ఈఎంటి సుంకరి విజయ్ కుమార్ పైలట్ శ్రీనివాస్ ఉన్నారు.

# బి.సి రిజర్వేషన్లు పెంచాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు

## - కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బి.సి.లను మోసం దగా చేసింది
## - హస్తనాపురం చౌరస్తా నుంచి ఎల్బీనగర్ వరకు బి.సి.ల భారి ప్రదర్శన

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని 2 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఊరించి ఊరించి చివరకు పాత జీవో ప్రకారం 22 శాతం అమలు చేస్తామని మొన్న క్యాబినెట్ లో నిర్ణయించడం అన్యాయం. ఈ నిర్ణయం ఉపసంహరించుకొని 42 శాతం అమలు చేయాలనీ డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు నేడు గ్రేటర్ హైదరాబాద్ హస్తనాపురం చౌరస్తా నుంచి ఎల్బీనగర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్ నాయకత్వం వహించారు. బి.సి ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, రాష్ట్ర బి.సి సంఘం అధ్యక్షులు రాజేందర్ సమన్వయము చేశారు.ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆర్ కృష్ణయ్య ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని విమర్శించారు. 42శాతం అమలుకు, బీసీలకు చట్టబద్ధంగా ఇచ్చేందుకు మొదటి నుంచి ప్రభుత్వం చిత్తశుద్ధి కృషి చేయలేదు. రిజర్వేషన్ల కేసు హైకోర్టులో నడుస్తుండగా తీర్పు రాకముందే ఎన్నికలు జరగవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సర్పంచ్ కాలపరిమితి ముగిసిన 2 సంవత్సరాలు గడిచిన ఈ రిజర్వేషన్ల సమస్య కోర్టులో తేలలేదు. ఇంకో నెల - రెండు నెలలో తీర్పు వస్తుంది. అప్పటి వరకు ఎన్నికలు ఆపడానికి అభ్యంతరం ఏముందని ప్రశ్నించారు.ప్రభుత్వానికి ఈ రిజర్వేషన్లు చట్టబద్ధం చేయడానికి సమస్య పరిష్కారానికి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ ఏ ప్రయత్నం చేయడం లేదు. అఖిల పక్షం సమావేశం ఏర్పాటు చేసి ప్రధానమంత్రి కలవడానికి ప్రయత్నం చేయడం లేదు. ఎందుకు ఈ చర్యలు తీసుకోలేదు. అలాగే పార్లమెంటులో లోక్ సభ లో కాంగ్రెస్ నాయకత్వం వహించే ఇండియా కూటమికి 240 మంది ఎంపీలు ఉన్నారు. ఒకనాడు కూడా ఈ కూటమి సభ్యులు బీసీ రిజర్వేషన్ల సమస్యపై పార్లమెంట్ లో ప్రశ్నించలేదు. వాకేట్ చేయలేదు. ఇతర అంశాలపై నెలల తరబడి పార్లమెంటు బహిష్కరించారు. కాంగ్రెస్ ఎంపీలు బీసీల రిజర్వేషన్ల గురించి ఎందుకు నోరెత్తడం లేదు. ఇదేనా వీరి చిత్తశుద్ధి అన్నారు.నిన్న జరిగిన క్యాబినెట్ లో మొదటగా గ్రామా పంచాయితీ ఎన్నికలు జరుపుతాం అని ప్రకటించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు పార్టీపరంగా ఉండవు. పార్టీ పరంగా 42 శాతం ఇస్తామని చెప్పడం ఎంతవరకు కూడా సమంజసం కాదు. ఇది పచ్చి మోసం దగా యున్నారు. మార్చి లోపు ఎన్నికలు పూర్తి చేయక పోతే 3వేల కోట్లు వృథా అవుతాయని ముఖ్యమంత్రి అంటున్నారు. 3 వేల కోట్ల బడ్జెటు కంటే బి.సి రిజర్వేషన్ ముఖ్యం. ఎందుకంటే 3వేల కోట్లను సర్దిచేయడం సులువే కాని 2 కోట్ల మంది బి.సి సమాజం ఎదురుచూస్తున్నా రిజర్వేషన్లను పెంచక పోవడం అన్యాయం కాదాయన్నారు. మర్చి లోగా బడ్జెటు ఆగిపోతాయి అన్నారు. మార్చికి ఇంకా 4 నెలలు సమయం యున్నది. హై కోర్టు లో ఉన్న కేసు నెలలోపు పూర్తి అవుతుంది. ఇంతలో అఖిల రాజకీయ పక్షాలతో ప్రధాన మంత్రితో చర్చలు జరిపి సమస్య పరిష్కారం చేయవచ్చు. అలాగే హై కోర్టులో కేసు గెలిచే అవకాశం యుంది. రాజ్యంగాబద్దంగా, చట్టబద్దంగా కేసు బలంగా యుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ఆ6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది దాని ప్రకారం అసెంబ్లీ చట్టం చేశారు. అలాగే జనాభా లెక్కలు ఉన్నవి. అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50% సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు తీర్పు కూడా ఉన్నది. దీనిలో న్యాయపరమైన అడ్డంకులు తొలిగిపోయాయి. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారము, న్యాయప్రకారము రాజ్యాంగ పరమైన అవరోధాలు లేవు కావున కోర్టులో కేసు గెలుస్తుంది. ఎందుకంటే రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవు కేసు బలంగాయుంది. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు. అసెంబ్లీలో చట్టం చేశారు.

# కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

## -రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలి అది కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కానీ ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు బాధ్యత నుండి తప్పుకోడానికి నీతి ఆయోగ్ లో నిర్ణయం చేయడం జరిగింది.ఈ దురుద్దేశం పెట్టుకొని పత్తి కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటు చేయడం, కపాస్ కిసాన్ యాప్ తీసుకురావడం, ఎకరాకు 7 క్వింటాళు కొనుగోలు చేయమని చెప్పడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అమాయక రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని షరతుపెట్టడం అంటే రైతులను దగా చేయడమే దేశంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత వ్యవసాయ రైతు వ్యతిరేక మూడు నల్లచట్టాలను తేవడం గాని, వ్యవసాయ మార్కెట్ వ్యవస్థను ప్రయివేట్ పరం చేయడానికి చేసిన పాలసీ పత్రం గాని, ఒక్కటొక్కటిగా వ్యవసాయాన్ని ప్రైవేట్ పరం చేయడానికి బహుళ జాతి కంపెనీలకు అప్పజెప్పడానికి చేస్తున్న కుట్రలో భాగంగానే ఇవ్వన్నీ ఆంక్షలు పెడ్తున్నట్లు కనిపిస్తుందని ఆయన ఆరోపించారు.

# తెలంగాణ ఉద్యమ కారులకి ఇచ్చిన హామీల అమలుకు కృషి

## -మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ బిసిసంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఉద్యమ నాయకుడు పొన్నం ప్రభాకర్ ని కలిసి తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీల అమలు పై చర్చించటం జరిగింది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నేను తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ సభ్యుడిని అని హామీల అమలు భాధ్యత నా పైన ఉన్నది ఇప్పటికే ఆలస్యం అయినది ఇప్పుడు తప్పకుండా ముఖ్యమంత్రి తో త్వరలోనే మాట్లాడి హామీల అమలు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ డా.చీమ శ్రీనివాస్ చైర్మన్. సురేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి జగన్ యాదవ్. వీరస్వామి. భాను ప్రకాశ్ రెడ్డి. జానకి రెడ్డి. పుట్నాల కృష్ణ. ఇందర్ కుమార్.మాణిక్యం. జగన్. శ్రీధర్ తస్దితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే కటిన చర్యలు

## -అధిక సంఖ్యలో స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్నఆటోలపై చర్యలు
## -చిల్కలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. జగన్ రెడ్డి




హైదరాబద్ నవంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);స్కూల్ బస్‌లు, ఆటో డ్రైవర్లను మరియు ఇతర ప్రయాణికులను ప్రయాణ భద్రత నిబంధనల అనుసరణపై చిల్కలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. జగన్ రెడ్డి ఆద్వర్యం లో అవగాహన కార్యక్రం నిర్వహించారు. ముఖ్యంగా వాహన నిర్ధారణ, అధిక లోడ్ వేసి ప్రయాణించే సమస్యలు, సరైన చోట్ల కూర్చోవడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి విషయాలపై నిబంధనలను వారికి వివరించారు. లాలపేట్ ప్రాంతంలో మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం మరియు అధిక సంఖ్యలో స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటోలను ప్రత్యేకంగా పరిశీలించే ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. పిల్లలు మరియు ప్రజల భద్రతకు భంగం కలిగించే ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈసందర్భంగా జగన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రత్యేక చర్యలు స్కూల్‌కు వెళ్లే పిల్లల రక్షణ కోసమే కాకుండా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సమాజంలో రోడ్డు నియమాలను బలోపేతం చేయడంలో తమ నిబద్ధతను చెప్పడానికి చేపట్టాయని తెలిపారు.ప్రజలందరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, మీ ప్రాంతంలో ట్రాఫిక్ సజావుగా, సురక్షితంగా సాగేందుకు సహాయపడాలని విజ్ఞప్తి చేసారు.ఈకార్యక్రమం లో చిల్కలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, సి. శ్రీధర్ మరియు చిల్కలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి, లాలపేట్ ప్రాంతంలో మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం మరియు అధిక సంఖ్యలో స్కూల్ పిల్లలను తీసుకెళ్తున్న ఆటోలను ప్రత్యేకంగా పరిశీలించే ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు.

# ఆంక్షలు లేకుండా చీరలు పంపిణీ చేయాలి

నర్సంపేట,నవంబర్ 20: నర్సంపేట బీఆర్ఎస్ రూరల్ మండల కమిటీ ఈ రోజు ఉదయం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

ఈ నేపద్యంలో మండల ఇన్చార్జి నామాల సత్యనా రాయణ, మండల కన్వీనర్ కొమ ళ్ళ గోపాల్ రెడ్డి మాట్లా డుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్ప డ్డాక కల్వకుంట్ల చంద్రశేఖర రావు తొలి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 18 సం.లు నిండిన ప్రతి మహిళకు చీరలు ఇచ్చారని తెలిపారు.ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మహిళ సంఘాలలో ఉన్న సభ్యు లకు మాత్రమే ఇస్తామని చెప్ప డం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో చాల మంది మహిళలకు చీరలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని వారు ధ్వజ మెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అంక్షలు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్క మహిళకు చీరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మహిళలు ఏదో చేస్తారని ఆశించిన వారికి నమ్మి నాన పోస్తే పుచ్చి బుర్రలై నట్టు ఉందనీ ఎద్దేవా చేశారు.ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఈర్ల నర్సిం హర ములు మోతే పద్మ నాభ రెడ్డి, బండారి రమేష్, మోటూరీ రవి, కోడారీ రవి, భూక్య వీరన్న పాల్గొన్నారు,

